


ఓం నమో భగవతే శ్రీ రమణయ

# రమణ భాస్కర



సంపుటి : 9 సంచిక : 7 పుష్పం : 12-13 20-12-2003

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

**PAGES : 16**

**VOL : 9 ISSUE : 7**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
**P.S. RAMARAJU**
LAKSHMI
MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 224589, 224689

**PRINTER**
**SHRIRAM GRAPHICS**
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 222438, 221260
94401-31188

## "దేన్ని భావన చేస్తామో - అదే ఔతాము"

భావనకు బలంఉంది. దేన్ని అయితే స్మరిస్తామో దానిని ధ్యానంచెయ్యటం మొదలుపెడతాము. దానివల్ల మోహంజనిస్తుంది. అది రాత్రికలలో కూడా మనవెంటవస్తుంది. మరణించేటప్పడు వాటిరూపాలే మనకళ్లముందు నిలుస్తాయి అందుకే "ఆశలు ఎక్కడో నివాసాలు అక్కడ" అంటారు. "కర్మలను బట్టే బుద్ధిపుడుతుంది. భావమే "విధి"కి నామాంతరం మన కర్మలు సాత్వికంగా ఉండాలి. మనం చేసే క్రియలు - ప్రతిక్రియలు ఫలితాలే కర్మలు. ప్రతీకర్మకు ఫలితంఉండి తీరుతుంది, దీనినే "కార్యాకారణస్వీయ చరిత చట్టం" అంటారు. ప్రభుత్వ చట్టాల నుంచి తెలివితో, యుక్తితో తప్పించుకోవచ్చును కాని, ఈశ్వరాజ్ఞతో అమలుజరిగే చట్టంనుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు. శ్రీరాముడు కాకి మీద బ్రహ్మాఅస్త్రం ప్రయోగిస్తే అది ముల్లోకాలు తిరిగి వచ్చి గతిలేక తిరిగి రాముని శరణువేడి ఒక కన్నుపోగొట్టుకొని ఫలితాన్ని అనుభవించవలసివచ్చింది. ఎంత చేస్తామో అంతా అనుభవించవలసిందే. మనస్సులో ప్రాపంచిక సంబందాల తూకం ఈశ్వరభావాన్ని మించి ఉన్నంతకాలం, "నేను-నాది" అనే భావాలు వ్యాపించి మనలో త్యాగభావనను, శాంతిభావనలను అణచివేస్తాయి. "బ్రహ్మాంసత్యం-జగత్తుమిధ్య" అనే సిద్దాంతం మరుగున పడి, దుఃఖం, క్లేశం, పీడనలు తప్పవు. పరులను మానసిక, వాచిక, శారీరకాలతో పీడిస్తే పాపం చుట్టుకొంటుంది. ప్రతిఫలంగా "భయం" అనే దుఃఖాన్ని చెల్లిస్తూ అశాంత మయులౌతాము". నిన్ను జూచుచుండ నిండును తత్త్వంబు తన్ను (శరీరాన్ని) జూచుచుండ తొలుగును మాయ; నిన్ను ఎఱిగినప్పడే తన్నుదానెఱుంగు అన్నారు వేమన. శ్రీనాన్నగారు యిలా అన్నారు.

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగప్రాభాషణములు**

28-11-2003 ప్రాతాళ్లమెరక ........ 2
16-11-2003 కాకినాడ ........ 10



Visit us @ www.srinannagaru.com



"ఏదుర్మార్గుడిగురించి నీవు నిరంతరం ఆలోచిస్తావో అదే నీకు గతిఔతుంది. మనం పామరులతో స్నేహం చేస్తే చీకటి లోకాలకు వెళతాము. ప్రాజ్ఞులతో సహవాసం చేస్తేఉత్తమలోకాలకు వెళతాము. జ్ఞానులతో సహవాసం చేస్తే మోక్షానికి వెళతాము. అందుకే పెద్దలు అంటారు. "సౌలభ్యము నీసొంతమురా" అని. గురుభావనలో భాగ్యాన్ని పొందు అని మనమనస్సుకు మనం హితవు చెప్పకొని, ఆగురుభావనలో ఉంటూ భావాతీత స్థితిని పొందుదాము.

- సాగిరాజు రామకృష్ణంరాజు , అర్ధవరం

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-03, ప్రాతాళ్ళమెరక

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,




ఇప్పడు మనదేశంలో అహింసను ఎవరు ప్రచారం చేయటంలేదు, హింసనుప్రచారం చేస్తున్నారు. ప్రేమను ప్రచారం చేయటం లేదు ద్వేషాన్ని ప్రచారం చేస్తున్నారు. సమాజం యొక్క పరిస్థితి ఇలా ఉంది. ప్రతీ విషయంలోను మనం సమాజాన్ని అనుసరించనక్కరలేదు, ప్రతీ విషయానికి అనుసరిస్తూ ఉంటే మనకు ఆత్మవిశ్వాసంలేదు అని అర్ధం. ఎవడికైతే ఆత్మవిశ్వాసం లేదో వాడు ఎంతో కొంత సాధన చేస్తున్నప్పటికి మంచిమార్గంలో నుండి చెడుమార్గంలోనికి వచ్చే అవకాశం ఉంది. ముందు నా మీద నాకు నమ్మకం ఉండాలి, నమ్మకం లేకపోతే జీవితంలో ఏదీ సాధించలేను. తెలివి ఒక్కటే సరిపోదు, తెలివితోపాటు ధైర్యం ఉండాలి, ధైర్యంలేకపోతే జీవితంలో ప్రకాశించలేడు. మనం పూజలు, జపాలు, ధ్యానాలు చేసుకొంటున్నాము. గుడికి వెళ్ళుతున్నాము చెట్లుచుట్టూ పుట్టలచుట్టూ తిరుగుతున్నాము. కాని మన మనస్సు లోపలకు ప్రయాణం చేయటం ఎప్పడైతే ప్రారంభమయ్యిందో అప్పడు నిజంగా మనకు ఆధ్యాత్మికజీవితం

ప్రారంభమవుతుంది. మనస్సు ఆత్మాభిముఖంగా ప్రయాణం చేసినప్పుడే ఆ మనిషికి ఆధ్యాత్మికజీవితం ప్రారంభమైనట్లులెక్క. మీరు జపధ్యానములు చేయవచ్చును అంతమాత్రం చేత మనం ఆధ్యాత్మికజీవితంలో ఉన్నట్లు అనుకోకూడదు. జపధ్యానములు చేసినప్పటికి మన మనస్సు ఆత్మాభిముఖంగా ప్రయాణం చేస్తోందా, లేదా అనేది చూసుకోవాలి. మనస్సు ఎక్కడైతే పుట్టిందో అక్కడే నశిస్తుంది కాని వేరేచోట నశించదు. మనస్సు హృదయంలో పుట్టింది మరల దానిని హృదయంలోనికి తీసుకొనివెళితేనే అది నశిస్తుంది. సముద్రంలో ఎన్ని కెరటాలు ఉన్నాయో, ఈభూమి మీద ఎన్ని రేణువులు ఉన్నాయో మనిషికి అన్ని కోరికలు ఉంటాయని పెద్దలు చెపుతారు. మాకు పది కోరికలు కంటే లేవండి అంటారు. ఆపది కోరికలు నెరవేరిన తరువాత ఇంకో వెయ్యి కోరికలు వస్తాయి. నీకు అన్ని కోరికలు నెరవేరినా ఏదో ఒక చిన్నకోరిక మిగిలిఉన్నా నీకు పునర్జన్మ వస్తుంది, దానికోసం మరల శరీరం ధరించవలసిందే. మనం కర్మచేస్తే ఫలితం వస్తుంది, ఆ ఫలితాన్ని అనుభవిస్తాము. ఆకర్మ చేసేది మనస్సే, ఫలితాన్ని అనుభవించేది మనస్సే. లోపలఉన్న బ్రహ్మానికి ఈ గొడవలతో సంబంధంలేదు.  మంచిపనిచేస్తే ఫలితం సుఖరూపంలోను, చెడుపనిచేస్తే ఫలితం దుఃఖరూపంలోను వస్తుంది. కాని భగవాన్ ఏమన్నారు అంటే ఈ రెండు సంసారం అన్నారు. అజ్ఞానంలోనుండి ఈసంసారం వస్తుంది. జ్ఞానం లేకుండా అజ్ఞానం నశించదు. ఇప్పుడు మీరు ఏదైతే సుఖం అనుకొంటున్నారో దానిలోపల దుఃఖం కూడా ఉంది, అది దుఃఖమిశ్రితం, భవిష్యత్‌లో వడ్డీతో సహా మీరు అనుభవించాలి అని శాస్త్రం చెపుతోంది. నీ హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది, దానికి జననమరణములతో సంబంధంలేదు, అది స్వతంత్రమైనది, దానిని నీవు అనుభవంలోనికి తెచ్చుకోవాలి. ఏ హృదయంలో అయితే సత్యపదార్ధం ఉందో అక్కడ నీ ఇంద్రియాలను, నీ మనస్సును, నీకు ఉన్న వివేకాన్ని, ప్రజ్ఞను గురిపెట్టి నూటికి నూరుపాళ్ళు  దానికి అభిముఖంగా ప్రయాణం చేస్తూఉంటే అది తెలియబడుతుంది కాని లేకపోతే అది తెలియబడదు. నిజమైన మౌనం జ్ఞానిలోనే ఉంది. మనోనాశనం ఎక్కడయితే అయిందో అక్కడే నిజమైన మౌనం వస్తుంది, ఆమౌనం కూడా సంభాషిస్తుంది. మౌనం బంగారం, మాట వెండి అని చెపుతారు. మన భక్తులు ఇంకా బంగారం కోరుకోవటం లేదు మాకు ఇత్తడే కావాలి, వెండే కావాలి అంటున్నారు. వారు బంగారం ఎందుకు కోరుకోవటంలేదు అంటే బంగారం యొక్క విలువ అంటే మౌనం యొక్క విలువ వారికి ఇంక తెలియటంలేదు. మాటలు అన్నీ నదులవంటివి, మౌనం సముద్రంలాంటిది అని శాస్త్రం చెపుతోంది. ఏ నాటికయినా ఈనదులు అన్నీ సముద్రంలో ఎలా కలవాలో అలాగ ఈమాటలు, తలంపులు అన్నీ జ్ఞానంలోకలవవలసిందే. నదికి గతి సముద్రమే అలాగే ఈమాటలకు గతి మౌనమే అని పెద్దలు చెపుతున్నారు.

ఆత్మానుభవం కలిగిన వాడి ద్వారా శక్తి తరంగాలు, జ్ఞానతరంగాలు వచ్చి ఇతరులపై పనిచేస్తాయి, సమాజం మీద పనిచేస్తాయి. వారందరూ బాగుపడాలి అని చెప్పనక్కరలేదు, బాగుపడాలనే సంకల్పం లోపలనుండే వస్తుంది. అది జ్ఞాని యొక్క వైభవం. జ్ఞాని సమక్షంలో ఉంటే బాగుపడాలనే బుద్ధి మీకు కలుగుతుంది. జ్ఞాని నోటితో ఏమీ చెప్పడు కాని లోపల నుండి ప్రేరణ కలుగుజేస్తాడు, జ్ఞానసముపార్జన చేయాలి, వివేకవంతంగా జీవించాలి అనే బుద్ధి మీకు కలుగుతుంది. మనం మాటమాటకు ఉద్రేకపడుతూ ఉంటే రాంగ్‌పాత్ లోనికి వచ్చేస్తాము. మన తింకింగ్ బేలెన్స్‌డ్‌గా ఉండాలి, పదిసార్లు ఆలోచించి ఒక మాట మాట్లాడాలి. చైతన్యం నీ హృదయంలోనే ఉంది. అది నీవై ఉన్నావు. అక్కడ నుండే నేను అనే తలంపు వస్తోంది. సముద్రంలో తుంపరలు ఎలా ఉంటాయెూ అలాగే చైతన్యసాగరంలోనుండి వచ్చిన తుంపరే ఈ నేను అనే తలంపు. ఈ నేను వచ్చి దేహంతో కలిసిపోతుంది. కలిసిపోయిన తరువాత  కళ్ళతో చూసేది నిజం అనిపిస్తుంది, చెవులతో వినేది నిజం అనిపిస్తుంది, ఈ శరీరం ఒక్కటే నిజం అనిపిస్తుంది. నువ్వు ఇలా బాహ్యాముఖంగాపోతున్నావు. ఈ నేను అనే తలంపును మిగతాతలంపుల నుండి వేరుచేసి ఆతలంపును పట్టుకొని, దానిని ఉపసంహరించి, అది ఏ చైతన్యంలో నుండి అయితే తుంపరగా బయలుదేరి వచ్చిందో అక్కడకు తీసుకొనివెళ్ళి ఆతుంపరకు మూలమైనటువంటి చైతన్యంలో ఆ నేను అనే తలంపును ఐక్యంచేయాలి, అప్పడు బ్రహ్మానుభవం కలుగుతుంది. అక్కడ ఐక్యం చేయకుండా,  దాని విజృంభణను ఆపుచేయకుండా అదిఎటు వెళితే మనం కూడా అటువెళుతూ ఉంటే ఇంక మనకు జ్ఞానం ఏమిటి? నేను అనే తలంపు విజృంభిస్తూ ఉంటే మనం దాని వేగాన్ని ఆపుచేయలేకపోతున్నాము అందుచేతనే గొడవలు అన్నీ వస్తున్నాయి. మంచిపనులు చేయటం వలన చిత్తశుద్ధి కలుగుతుంది, అప్పడు మనస్సుకు లోచూపు కలుగుతుంది. మంచిపనులు చేసినా మనకు లోచూపు రావటం లేదు అనుకోండి వాడికి ఆధ్యాత్మికప్రయాణం సున్న.   పైకి ఎంతదూరం అయిన దూసుకొని వెళ్ళగలముగాని లోపలకు ఒక్క అంగుళం దిగటం కష్టం.  మీస్వభావం మీద మీకు పోరాటం లేకుండా లోపలకు దిగలేరు.  పరవంచనకంటే ఆత్మవంచన ప్రమాదం.  మీ దగ్గర 10 రూ॥లు ఉన్నాయి అనుకోండి కాని 1000 రూ॥లు ఉన్నట్లుగా బజారులో కనిపిస్తున్నారు అనుకోండి అది ఆత్మవంచన. కీర్తికాంక్ష చాలా ప్రమాదం, కీర్తికాంక్ష ఉన్న వారికి అసలు మనస్సు లోపలకు వెళ్ళదు. మన హృదయంలో ఉన్న సద్వస్తువు నుండి మనం వేరుపడిపోయాము,

అలా వేరుపడటంవలననే నేను అంతటి వాడిని, నేను ఇంతటివాడిని అని అనుకోవటానికి అలవాటుపడ్డాము, పాడైపోతున్నాము. ఇవాళ కొత్తగా పాడైపోవటంకాదు ఎప్పటి నుండో పాడైపోతూ వస్తున్నాము. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని మనం అంగీకరించినా, మనం అంగీకరించకపోయిన ఆయన ఉన్నాడు, ఆయన ఉన్నాడనే నమ్మకం, విశ్వాసం కనుక మనకు ఉంటే ఆయనలో ఐక్యమవ్వాలనే బుద్ధి మనకు కలుగుతుంది. నువ్వు ఎప్పుడైతే బ్రహ్మంలో నుండి వేరుపడ్డావో అప్పుడు నీకు కర్తృత్వబుద్ధి వచ్చేసింది, కర్తృత్వబుద్ధి నశిస్తేగాని నీవు బ్రహ్మంలో ఐక్యంకాలేవు. బ్రహ్మంలో ఐక్యమయితేగాని నీకు ఆనందం తెలియదు. లోపలఉన్న ఆనందం నీకు తెలిసేవరకు నీ మనస్సు ఆనందం కోసం బజారులో వెతుక్కొంటూ ఉంటుంది. ఇలా ఆనందంకోసం బజారులో వెతుక్కొంటూ ఉన్నంతకాలం పునర్జన్మలు తప్పవు. నీకు లోపలఉన్న ఆనందం తెలిసినప్పుడు మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది, దానికి నిగ్రహం పెరుగుతూ ఉంటుంది. నీవు లోపల ఆనందమయుడవయితే, లోపలఉన్న ఆనందం నీకు అనుభవంలోనికి వస్తే అప్పుడు నీకు ఎటుచూసినా ఆనందమే, ఈ ప్రపంచం అంతా ఆనందమయంగా గోచరిస్తుంది, ఈ శరీరానికి వచ్చే మరణం కూడా ఆనందంగానే గోచరిస్తుంది. అది జ్ఞానంలో ఉన్న వైభవం. మనకు భక్తి అవసరమే, జ్ఞానం అవసరమే ఈ రెండింటిని సమన్వయం చేసుకోవాలి. వాడు ఏమతంలో ఉన్నవాడు ఏమార్గంలో ప్రయాణం చేస్తున్నప్పటికి ప్రపంచచరిత్రలో ఇంతవరకు స్వార్థపరుడు ఎవరికి ఆత్మజ్ఞానం కలుగలేదు. మహాత్ములతో సాంగత్యం నిజతత్వాన్ని తెలుసుకోవటానికి మంచిపద్ధతి. మనస్సు ఎక్కడయితేపుడుతుందో అక్కడే నశిస్తుంది. మనస్సును దానిపుట్టుస్థానం దగ్గరకు తీసుకొని వెళ్ళకపోతే అది నశించే సమస్యేలేదు. నీ తెలివివలన, వివేకంవలన నీ అంతట నీవు ప్రయత్నం చేసుకోగలిగితే చేసుకో, అలా చేసుకోలేకపోతే మహాత్ములతో, మహర్షులతో సాంగత్యం అవసరం. మహాత్ములతో సాంగత్యం ఎందుకంటే వారిని తెలుసుకోవటానికి కాదు, నీ హృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకోవటానికి వారి సాంగత్యం నీకు సహకరిస్తుంది. నీ హృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకోవు అనుకో నీకు స్వేచ్ఛలేదు, సుఖంలేదు, శాంతిలేదు, అక్కడకు చేరుకొనేవరకు ఏదోఒక రూపం, నామం, ఏదోఒక జన్మ, ఏదోఒక పుణ్యం పాపం ఇలా ఏదో ఒకటి నిన్ను వెంటాడుతూ ఉంటుంది. మన బుద్ధిలో ఏదో దోషం ఉంది, ఏదో తేడా ఉంది అందుచేత మనం బ్రహ్మంలో ఐక్యం అవ్వలేకపోతున్నాము. నీ శరీరంలో ఏదైనా లోపం ఉంటే నొప్పి ప్రారంభమవుతుంది, నీవు సహజంగా ఉండలేవు అలాగే నీ బుద్ధిలో దోషం ఉన్నప్పుడు నీవు నాచురల్‌గా, నార్మల్‌గా ఉండలేవు, మనం ఏకాంతంగా కూర్చొని చేయవలసింది ఏమిటి అంటే మన మాట





సహజంగా ఉందా, అసహజంగా ఉందా? మనం చేసే పని సహజంగా ఉందా, అసహజంగా ఉందా? అని చూసుకోవాలి.

మనం సుఖపడాలంటే దేహం ఉండాలి, దేహంచనిపోతే మన సుఖంకూడా చెడిపోతుంది అనేబుద్ధి అందరికి ఉంది. గాఢనిద్రలో మనకుదేహం గొడవ లేదు మరి అక్కడ సుఖంగా ఉంటున్నాము కదా. దేహం వలననే నీకు సుఖం, శాంతి వస్తూఉంటే గాఢనిద్రలో దేహానికి సంబంధించిన స్పర్శలేకుండా నువ్వు ఉంటున్నావు కదా. అప్పుడు నీవుసుఖపడుతున్నావా, దుఃఖ పడుతున్నావా? నీవు సుఖంగానే ఉన్నావు. ఆసుఖానికి నీదేహం ఏమైనా సహకారం చేస్తోందా? సహకారం చేయడంలేదు. మరి దేహం పోతే సుఖం పోతుందని నువ్వు ఎందుకు భయపడుతున్నావు? భోగం ఉంటే సుఖంవస్తుంది అని అందరూ అనుకొంటారు. కృష్ణుడు ఏమిచెప్పాడు అంటే భోగం వలన రోగం వస్తుంది అని చెప్పాడు. భోగం వలన సుఖం వస్తుందిఅని నీవు అనుకోవచ్చు గాని ఆసుఖం దుఃఖ మిశ్రితం. దుఃఖమిశ్రితమైన సుఖంకూడా ఒకసుఖమేనా? మనకు ఉండవలసినంత భక్తి, శ్రద్ధ, వైరాగ్యం లేదు. అందుచేత సత్పురుషులతో సహవాసం చేయటం మంచిది. మంచివారి తోటి సహవాసం చేయటం వలన జీవించి ఉండగానే మనం డిఫరెంట్ వరల్డ్‌లోకి వెళ్ళిపోతాము. మహాత్ముల మౌనం కూడా మాట్లాడుతుంది, పనిచేస్తుంది. మౌనానికి ఉన్న శక్తి వాక్కుకు లేదు. మీరు ఇంటికి వెళ్ళిపోండి. మాటలు లేకుండా, తలంపులు లేకుండా క్వైట్‌గా కూర్చోండి. అప్పుడులోపల ఉన్న బ్రహ్మం తళుక్కున మెరుస్తుంది, అది మీకు తెలుస్తూ ఉంటుంది. మనకు లోపలఉన్న వస్తువు ఎప్పుడైనా స్ఫురించినా మనఅలవాట్లయొక్క వేగం వలన, వాసనలయొక్క వేగం వలన అది పర్మినెంట్ అవ్వదు. భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే నీకు డబ్బుఉంటే భరించలేకపోతున్నావు, చదువుఉంటే భరించలేకపోతున్నావు, అధికారం ఉంటేభరించలేకపోతున్నావు. ఈచిన్న చిన్న విషయాలే నీవు భరించలేనప్పుడు ఆత్మజ్ఞానానికి ఎలా వారసుడవవుతావు. భగవంతుడు కావాలనే ఒకోసారి దుఃఖాన్ని, ఒకోసారి సంతోషాన్ని పంపిస్తాడు. అలా ఎందుకు పంపిస్తాడు అంటే నీమనస్సును ప్రిపేర్ చేయటానికే అలాచేస్తాడు, అదినీకు తెలియక కంగారు పడుతున్నావు. మనస్సు ప్రిపేర్ అవ్వకుండాఎవరికీ ఆత్మజ్ఞానం కలుగదు. భగవంతుడు నీహృదయంలో ఎంత సహజంగా ఉన్నాడో జీవితంలో నీప్రవర్తన అంతసహజంగా ఉంటే మిధ్యానేను నీకు తెలియకుండానే రాలిపోతుంది. పాము తలమీద కొడితే పాము చస్తుంది కాని పుట్టమీద కొడితే పాము చావదు అలాగే నీసాధనఅంతా మూలతలంపు మీద గురిపెట్టు. దానిని వదిలేసి ఏదోచేసాను అంటే కుదరదు. దేహంతో ఏతలంపు అయితే తాదాప్యం పొందుతోందో దానిని స్లోగా, స్టడీగా రెడ్యూస్ చేసుకొంటూరా, అదే తపస్సు యొక్క

ప్రయోజనం. జ్ఞానం పొందడానికి నామైండ్ ఫిట్ అయ్యింది అనుకోండి, ప్రిపేర్ అయ్యింది అనుకోండి నేను జ్ఞానం పొందాలి అని అనుకోనక్కరలేదు, జ్ఞానం వచ్చేస్తుంది. మనం ఏమి చేస్తున్నాము అంటే ఏమీ ప్రిపరేషన్ లేకుండా జ్ఞానం వచ్చేయాలి అని అనుకొంటాము. భగవంతుడు ఏమైనా అమాయకుడా? మనకు ఎంత వరకు అర్హతఉందో మనలోపల అంతర్యామిగా ఉండి భగవంతుడు చూస్తున్నాడు. మనకు వచ్చేప్రతి తలంపుకు ఏదోరోజున మనం ఆయనకు సమాధానం చెప్పాలి. మనందరికి మనచుట్టాలు బలం, స్నేహితులు బలం, డబ్బుబలం కాని జ్ఞానికి భగవంతుడే బలం, భక్తుడికి భగవంతుడే బలం. మనం భక్తులమేగాని భగవంతుడే మనకు బలం అనుకోవటంలేదు, బాంక్‌లో ఉన్న డబ్బుమనకు బలం అనుకుంటున్నాము. ఈతలంపును కూడా భగవంతుడు చూస్తూ ఉంటాడు. మనం వేరుభావనను నెమ్మదిగా తగ్గించుకొంటూరావాలి. మనం ఎప్పుడో విడిపోయాము, ఇలా దొర్లుకుంటూపోతున్నాము. మనం ఎక్కడ నుండి అయితే విడిపోయామో అక్కడ ఐక్యమయ్యే వరకు మనకు జ్ఞానంలేదు, శాంతిలేదు, ఇలా శరీరాలు మోస్తూ ఉంటాము, ఏదో కర్మానుభవాలు వస్తూఉంటాయి. కొంతకాలం సంతోషం, కొంతకాలం దుఃఖం లేకపోతే 100రూ॥లు లేనివాడు 100కోట్లు సంపాదించవచ్చు, ఇవాళ 100కోట్లు ఉన్నవాడు 100రూపాయలు కూడా లేకుండా పోవచ్చు ఇది అంతా భగవంతుడి లీల. నీలో ఏమీ లేదు, వూరికే పనిముట్టు క్రిందనిన్ను త్రిప్పుతున్నాడు, నాలో ఏదో ఉంది అనినీవు అనుకొంటున్నావు, అలా అనుకోవడం మానివెయ్యి అప్పుడునీకు జ్ఞానం కలుగుతుంది. సత్పురుషులు సమాజానికి శాంతిని, ఆనందాన్ని పంచిపెడతారు, సత్పురుషులు కానివారు సమాజానికి దుఃఖాన్ని, అసూయను, ద్వేషాన్ని పంచిపెడతారు. వారు సత్పురుషులు అవునో, కాదో ఈఒక్క విషయంలోనే మనకు తెలుస్తుంది.

నీకు గురువుతో మానసిక సంబంధం ఉండాలి. శరీరాలు ఎక్కడ ఉన్నా ఒక్కటే. మనకు అరుణాచలంలో ఉన్నప్పుడు ఒకరకంగా, పాతాళమెరకలో ఉన్నప్పుడు ఒకరకంగా ఉన్నట్లు అనిపిస్తోంది అనుకోండి, అది ఆవరణ దోషం, అజ్ఞానికి ఆవరణదోషం ఉంటుంది, జ్ఞానికి ఆవరణదోషం ఉండదు. నువ్వు మౌనంగా, ఆనందంగా, శాంతిగా ఉన్నప్పుడు నీఇంట్లో సభ్యులుకూడా ఆనందంగా కనిపిస్తారు, లోకం అంతా ఆనందంగా కనిపిస్తుంది. చావుకి జీవితానికి మనకు భేధం కనిపిస్తోంది అనుకోండి మనం అవుట్ అయిపోయినట్లు లెక్క, మనకు పునర్జన్మ వచ్చేస్తుంది. గురువు అంటే ఆత్మ, గురువు అంటే చైతన్యం. గురువును శరీరమాత్రుడిగా అనుకొన్నప్పుడు ఆశరీరంపోతే గురువు చనిపోయాడు అనుకొంటావు కాని గురువు అంటే ఆత్మ, ఆత్మకు మరణం ఏమిటి? గురువుతో ఉన్న అనుబంధం తెగదు. మీకు మాకు ఉన్న అనుబంధం జన్మాంతరఅనుబంధం అయితే ఆస్నేహాలు కంటిన్యూ అవుతాయి, పూర్వజన్మ అనుబంధం లేనప్పుడు ఏదో పాయింట్ దగ్గర బ్రేక్ అయిపోతూ ఉంటుంది, ఇటువంటి విషయాలగురించి తలకాయ పాడుజేసుకోవద్దు. గురువుతో అనుబంధం వలన జీవలక్షణాలు తగ్గుతాయి, జీవలక్షణాలు తగ్గుతూ ఉంటే అజ్ఞానం తగ్గుతుంది. గురువుతో అనుబంధం వలన ఆయన దయ ఆపరేట్ అవుతూ ఉంటుంది, ఎక్కడైతే మనస్సు పుట్టిందో అక్కడకు మన మనస్సును గెంటుతూ ఉంటాడు, ఇది అంతా నీకు తెలియకుండానే జరుగుతూ ఉంటుంది. మనస్సును దాని పుట్టుస్థానమైన హృదయంలోనికి గెంటేటప్పుడు ఏమైన ఆటంకాలు వచ్చినా వాటిని ఆయనే క్లియర్ చేసుకుంటాడు. లోపలఉన్నగురువుకు నీజుట్టు అందేవరకు బయటఉన్నగురువు నిన్ను లోపలకు నెట్టుతాడు. లోపలఉన్నగురువు ఏమిచేస్తాడు అంటే నీజుట్టు పట్టుకున్న తరువాత తనదగ్గరకు తీసుకుంటాడు లోపలకు తీసుకోవటమేకాదు ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు, వాడు గురువు. ఎప్పుడైతే రూపబుద్ధి, నామబుద్ధి ఉందో ఆ జీవుడు వికారాలు లేకుండా ఉండలేడు. రూపబుద్ధి, నామబుద్ధి నశిస్తేవాడు వికారరహితుడు అవుతాడు. ఆవికారాలు అన్నీ గురువుకు తెలుస్తూ ఉంటాయి. ఆ వికారాలను ప్రక్కను నెట్టి నిన్ను లోపలకుతోస్తాడు, వాడు గురువు. నీ హృదయంలో ఉన్న సత్యంతో నీవు కలిసి ఉండగలిగితే మంచిదే, ఇంక నీవు బయట తిరగనక్కరలేదు, ఇంక నీకు సత్పురుషులతో సహవాసం ఎందుకయ్యా? నీకు హృదయంలో ఉన్న సత్యం, జ్ఞానగంగ అందనప్పుడు ఆజ్ఞానగంగ ఎక్కడయితే ఊరుతూ ఉందో వారితో సహవాసం చెయ్యి, అదే సజ్జనసాంగత్యం. మీరు పూర్వజన్మలో ఎంతోకొంత పుణ్యకర్మ చేసి ఉండకపోతే సత్పురుషులతో సహాయం చేయాలనే బుద్ధి కలుగనే కలుగదు. జ్ఞాని సమక్షంలో ఉన్నప్పుడు వారు ఏదైతే పొందుతున్నారో అది మనం కూడా పొందాలి అనే ప్రేరణ మనకు కలుగుతుంది. ఒక మహాత్ముడిని దర్శించిన వారు ఎవరూ రిక్తహస్తాలతో వెళ్లరు. ఆధ్యాత్మికంగా పురోగతిని పొందుతారు. ఆ పొందినది ఏదో మీకు వెంటనే తెలియకపోవచ్చు, మీ కళ్లకు కనిపించకపోవచ్చు, మీ చెవులకు వినపించకపోవచ్చు, మీ బుద్ధికి అందకపోవచ్చు కాని ఒక మహాత్ముడి దర్శనం వలన మీరు పొందేది ఏదో పొందే తీరుతారు. నీకు ఏదైనా చిన్న అవమానం కలిగింది అనుకో, అదిభరించ లేకపోతున్నావు అనుకో, రైలు క్రింద తలకాయపెట్టి చనిపోతాను అన్నావు అనుకో ఇంక నీకు ఆత్మజ్ఞానంఏమిటి? అంటున్నారు భగవాన్. అంటే నీ మనస్సు ప్రిపేర్ అవ్వలేదు అని అర్థం. నీ మనస్సు చనిపోయేలాగ ప్రిపేర్ అవ్వటం నేర్చుకో. దేహముకాదు చనిపోవలసింది, దేహంతో తాదాప్యం పొందే నేను చనిపోవాలి. శరీరానికి మరణం రాకముందే ఆత్మసుఖాన్ని మీరు పొందలేకపోతే, గురువు అనుగ్రహం మీకు ఉంటే ప్రాణంపోయే టైములో ఆత్మసుఖాన్ని మీకు అందింపచేసి, పునర్జన్మలేకుండా చేస్తాడు, ఆశక్తి కూడా గురువుకు ఉంది.

చావులోనుండి అమృతస్థితిని పొందటానికి సత్పురుషుల సహవాసం మీకు నౌకలాగ ఉపయోగపడుతుంది. అందుచేత సజ్జనసాంగత్యం విడిచిపెట్టవద్దు. సత్పురుషుడు అంటే నలుగురు కూర్చొంటే మునిగిపోయే నావలాంటి వాడుకాదు, ఆయన ఒక పెద్ద నౌక అనేకమందిని మోక్షానికి తీసుకొనిపోతాడు. మనం మనస్సులో చైతన్యాన్ని తెలుసుకోవాలనుకొంటున్నాము అనుకోండి, కళ్ళు సినిమాకు వెళదాము అంటున్నాయి అనుకోండి, అలా పరస్పర విరుద్ధం వలన జ్ఞానంరాదు, నీ ఇంద్రియాలు కూడా, నీకు సహకరించాలి. భగవాన్ స్కందాశ్రమంలో ఉండగా ఒకతను టౌనులో నుండి రోజూ భగవాన్‌ను చూడటానికి వచ్చేవాడు. వాళ్ళ ఇంట్లో వారు ఏమిచెప్పారు అంటే ఏమయ్యా వాడు ఏదో గోచీపెట్టుకొని అక్కడ కూర్చొన్నాడు. నీవు రోజూ పని మానివేసి అక్కడకు వెళుతున్నావు అన్నారు. ఇంట్లోవారు చెప్పింది బాగానే ఉంది అనుకొని అతడు కొన్ని రోజులు వెళ్ళటం మానివేసాడు. ఒక నెలరోజులు తరువాత మరల చూడాలనిపించి అక్కడకు వచ్చాడు. భగవాన్ ఒక్కరే కూర్చొన్నారు. భగవాన్‌ను చూడగానే సడన్‌గా అతనికి దుఃఖం వచ్చేసింది. భగవాన్ అంటే మన హృదయలోనే ఉన్నాడుకదా, ఏమి జరుగుతోందో అంతా ఆయనకు తెలుసుకదా, అతను ఏడుస్తూ ఉంటే భగవాన్ ఒక మాట చెప్పారు నన్ను చూడటంవలన నీకు ఏమీ లాభం లేకపోవచ్చును. కాని నన్ను చూడకపోవటం వలన వచ్చే నష్టం నీకు తెలుస్తోంది కదా, చివరకు నీకు దుఃఖం మిగిలింది. బలహీనులకు, బద్ధకస్తులకు, పిరికివారికి ఆత్మజ్ఞానం కలుగదు అని శాస్త్రం చెపుతోంది. అరుణాచల శివ అంటే మా ప్రక్కవారికి వినబడటంలేదు వారు ఏమనుకొంటారో, వీరు ఏమనుకొంటారో అని అస్తమాను ఇలా అనుకొంటాము అనుకోండి మనకు పెరిగేది జ్ఞానంకాదు, అజ్ఞానం పెరుగుతుంది. అజ్ఞానికి ఇతరులు ఉన్నారు గాని జ్ఞానికి ఇతరులు లేరు. ఇలా అనుకోవటానికి అంటూ అసలు ఒకడు ఉన్నాడా? జ్ఞానసముపార్జనకోసం అవసరమైతే భూమి యొక్క అంచులదాకవెళ్ళండి. సజ్జనసాంగత్యం కోసం అన్వేషించండి, వారు మీ పరిసరాలలో లేకపోతే వారికోసం ఎంతదూరమైన ప్రయాణం చేయండి. సజ్జనసాంగత్యం వలన అంతరదృష్టి కలుగుతుంది, అంతరదృష్టివలన ఆత్మజ్ఞానం కలుగుతుంది.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 16-11-03, కాకినాడ

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

సమాజంలో కులం పేరుమీద, మతం పేరుమీద ఎక్కువగా విభజన జరుగుతూ





ఉంటే అది సమాజానికి మంచిదికాదు, దేశానికి కూడా మంచిదికాదు, సంఘాలు ఉండటం మంచిదే. కాని అవి కేవలము ఒక కులానికి, ఒక మతానికి పరిమితంకాకుండా ఇతరులకు కూడా మనం చేయగలిగింది చేయటం మనకూ మంచిది, దేశానికి మంచిది, దేశాన్ని అభివృద్ధి చేసుకోవటం ముఖ్యం. దేశం అభివృద్ధి అవ్వటానికి అన్ని కులాల, అన్ని మతాల సహకారం అవసరం. సమాజం యొక్క ఉజ్వల భవిష్యత్‌కు అందరూ కూడా సహకరించాలి. ఇప్పడు మనదేశంలో పనిమీద గౌరవంలేదు. భగవద్గీతలో కర్మయోగానికి చాలా ప్రాముఖ్యత ఇచ్చాడు. మనం పనిలేకుండా కూర్చొంటే సోమరితనం వస్తుందిగాని జ్ఞానంరాదు. అందుచేత మనంపనిచేయాలి. పని ఎలాచేయాలంటే నిర్మలంగా చేయాలి, నిశ్చలంగాచేయాలి, ప్రేమగా చేయాలి, ఫలితం ఆశించకూడదు. తపస్సు అంటే కేవలము యోగాభ్యాసాలుకాదు. ధర్మాన్ని ఆచరించకుండా, మనోనిగ్రహం సాధించకుండా ఏదో మేము తపస్సు చేసాము అంటే ధర్మాన్ని ఆచరించకపోతే నీవు కేవలము యోగాభ్యాసాలు చేసినంత మాత్రంచేత ఆత్మజ్ఞానమురాదు. ధర్మాన్ని ఆచరించకుండా సమాజంలో మనం చేయవలసిన పని నిర్మలంగా, నిశ్చలంగా, మన డ్యూటీని మనం పెర్‌ఫెక్టుగా చేయకుండా ఎవరికీ జ్ఞానోదయం అయ్యే అవకాశంలేదు. ఎస్కేపిజం కుదరదు. ఈక్రియేషన్ అంతా ఒక పెద్దయంత్రం. అందులో మనం చిన్న చిన్న పనిముట్లము, మన భాగం ఏదో మనం చేయాలి. మన భాగం మనం చేయకుండా, ఎస్‌కేఫ్ అవ్వటానికి ప్రయత్నిస్తే, సోమరితనానికి అలవాటుపడితే, మనం ఏపనిలో నుండి అయితే ఎస్‌కేఫ్అవ్వటానికి ప్రయత్నం చేస్తున్నామో నాలుగు మొట్టికాయలు మొట్టి రాబోయేజన్మలో అదేపనిని భగవంతుడు మనచేత చేయిస్తాడు. అందుచేత మనం పనిదొంగలం అవ్వకూడదు. వారు ఆపనిచేస్తున్నారు, వీరు ఈపని చేస్తున్నారు లేకపోతే వారు అలాగ చేస్తున్నారు, వీరు ఇలాగ చేస్తున్నారు అనే గొడవలువద్దు. అందరూ ఒకేపనిచేయరు, ఒకోదేహం ద్వారా ఒకోపని జరుగుతూ ఉంటుంది. మనకు ఏపని అయితే భగవంతుడు కేటాయించాడో ఆపనిని మనం పెరఫెక్టుగా చేయాలి, జాగ్రత్తగా ఓర్పుగా, నేర్పుగా చేయాలి, దానితాలుక ఫలితం ఆశించకూడదు. ఆశించకుండా ఉంటే మనం నిర్మలంగా ఉంటాము. మనం కోరితెచ్చుకున్నది మనలను బాధిస్తుంది, కోరిక లేకుండా వచ్చినది మనలను బాధించదు. ఈ దేహము ఏపనిమీద అయితే వచ్చిందో అ పనిపూర్తి అయిన తరువాత అది మరణిస్తుంది, అది గుర్తుపెట్టుకోండి. ఈశరీరం పుట్టినరోజునే అది ఏరోజు మరణించాలో నిర్ణయింపబడి ఉంటుంది కాని అది మనకు తెలియదు. మన యోగక్షేమములు చూడమని భగవంతుడిని ప్రార్థిస్తూ ఉంటాము. మనం ఒక దేహంతో తాదాప్యం పొందినంతకాలం ఏదో మన అవసరాలనుబట్టి భగవంతుడిని ప్రార్థిసాము, అది కూడా భక్తిలో ఒక భాగమే. ఆత్మజ్ఞానసముపార్జనకు అందరికీ యోగ్యత